సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 17-6-2025

సంపుటి: 21 సంచిక: 72

పేజీలు: 8 వెల: రూ.1















• ఎడిటోరియల్

# తొమ్మిది దశాబ్దాల తర్వాత కులగణన

ఎట్టకేలకు దేశంలో కులగణనకు రంగం సిద్ధమైంది. దాదాపు తొమ్మిది దశాబ్దాల తర్వాత కులాలవారీ జనాభా లెక్కలు వెల్లడికానున్నాయి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, కార్యక్రమాల అమలులో సామాజిక, ఆర్థిక సమతుల్యత సాధ్యమవుతుందని సామాజిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వాయిదా పడిన జనాభా గణన కార్యక్రమంతో పాటే కులాల వారీ జనసంఖ్యను గణించేందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 2026లో ప్రారంభమై 2027 నాటికి రెండు దశల్లో సెన్సెస్ ముగుస్తాయి. కొత్త జనాభా లెక్కలే 2029 లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు ప్రామాణికం కానున్నాయి. బ్రిటీష్ హయాంలో 1872లో దేశంలో తొలిసారి జనాభా లెక్కల సేకరణ జరిగింది. అప్పటి నుంచి ప్రతి పదేళ్లకోసారి జనగణన నిర్వహించేవారు. ఇప్పటి వరకు 15 సార్లు దేశంలో జన గణన జరిగింది. స్వాతంత్ర్యానంతరం.. అంటే 1949 తర్వాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జనాభా లెక్కల సేకరణ బాధ్యత తీసుకుంది. చివరిసారి 2011లో జనగణన జరిగింది. ఆ లెక్కన 2020లో మళ్లీ సెన్సెస్ చేపట్టి 2021లో కొత్త లెక్కలు ప్రకటించాల్సి ఉంది. కానీ కరోనా విపత్తు కారణంగా కేంద్ర ప్రభుత్వం దాన్ని నిరవధికంగా వాయిదా వేసింది. ఎట్టకేలకు నాలుగేళ్లు ఆలస్యంగా ఇప్పుడు ముహూర్తం కుదిరింది. దీనివల్ల పదేళ్లకోసారి నిర్వహించాల్సిన జనగణన సైకిల్ మారిపోతుంది. ఆ ప్రకారం మళ్లీ 2036లోనే జనగణన జరుగుతుంది. కేంద్ర హోంశాఖ పరిధిలోని సెన్సెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలో ఈ మొత్తం ప్రక్రియ జరుగుతుంది. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. దానికి జనాభా లెక్కలే ప్రామాణికం. జనాభా దామాషా ప్రకారమే నియోజకవర్గాల పరిధి కుదింపు, పెంపు ఉంటుంది. అయితే 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనకు ఎప్పుడో 1971 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకోవడం వల్ల కొంత అన్యాయం జరిగిందన్న వాదనలు ఉన్నాయి. 2029 పునర్విభజనలో అటువంటి విమర్శలకు ఆస్కారం ఇవ్వకుండా కొత్త జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకుంటారు. ఈసారి జనగణనకు మరో ప్రత్యేకత కూడా ఉంది. జనాభా వివరాలతో పాటు కులాలవారీ లెక్కలు కూడా సేకరించనున్నట్లు నోటిఫికేషన్‌లో కేంద్రం వెల్లడించింది. దాదాపు 90 ఏళ్లుగా దేశంలో కుల జనాభా వివరాలు సేకరించలేదు. ఎప్పుడో బ్రిటీషర్ల కాలంలో 1931లో చివరిసారి సేకరించిన కులగణన లెక్కలే అధికారికంగా అందుబాటులో ఉన్నాయి. వాస్తవానికి జనాభా గణనతో పాటే కులాలవారీ జనగణన కూడా చేపట్టేవారు. ఆ విధంగా 1931 వరకు బ్రిటీష్ ప్రభుత్వం సేకరించింది. 1941లోనూ కులగణన జరిపించినా ఆ గణాంకాలను ఎందుకనో విడుదల చేయలేదు. దాంతో 1931 కులగణన లెక్కలే చివరి అధికారిక లెక్కలు. అయితే పదేళ్లకోసారి జరిగే జనాభా లెక్కల సేకరణతో పాటే ఎస్సీ, ఎస్టీ జనసంఖ్యను లెక్కిస్తున్నారు. మిగతా కులాల గణన మాత్రం స్వాతంత్ర్యానంతరం నిలిచిపోయింది. కులాలవారీగా జనాభా వివరాలు సేకరిస్తే భారతీయ సమాజంలో కులమత వైషమ్యాలు పెరిగే ప్రమాదముందన్న ఆందోళనలు వ్యక్తం కావడంతో స్వాతంత్ర్యానంతరం అధికారం చేపట్టిన భారత ప్రభుత్వాలు కులగణనను నిలిపివేశాయి. కానీ 2011లో నిర్వహించిన జనగణనతో పాటు కేంద్రం సామాజిక, ఆర్థిక కులగణన నిర్వహించింది. 2016లో వాటిలోనే ఇతర గణాంకాలను ప్రకటించిన కేంద్రం, కులాలవారీ లెక్కలను మాత్రం బయటపెట్టలేదు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కేంద్రం స్పందించింది. సామాజిక, ఆర్థిక కులగణనలో చాలా లోపాలు ఉన్నట్లు గుర్తించామని, ఆ సమాచారం ఉపయోగపడదు కనుకనే బయటపెట్టలేదని న్యాయస్థానానికి తెలిపింది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా కులగణన చేపట్టాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈ లెక్కలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాల అమలులో చాలా కులాలకు అన్యాయం జరుగుతోందన్న రాజకీయ పార్టీలు, కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. దామాషా ప్రకారం రిజర్వేషన్లతో సహా పథకాలు వర్తింపజేయాలంటే కులలవారీ జనాభా లెక్కల సేకరణ అనివార్యమని స్పష్టం చేస్తున్నాయి. దీనికి కేంద్రం అంగీకరించకపోవడంతో బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా కుల గణన పేరుతో ఓ సర్వే నిర్వహించింది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కులసర్వే నిర్వహించి, వివరాలు ప్రకటించినా, అవి తప్పులతడకగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. కానీ చివరి కేంద్రమే దిగి వచ్చి కులగణనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పూర్తి శాస్త్రీయంగా కులాల లెక్కలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## నందిగాంలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ

(సత్యంన్యూస్, టెక్కలి)

బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న చంద్రబాబు నాయుడు పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని నందిగాం వైకాపా కార్యాలయంలో నందిగాం మండల వైకాపా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫల్గుణరావు తదితరులు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు చేస్తున్న అరాచకాలు, ఏడాది పాలనలో చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచులు జడ్యాడ జయరాం, పోలాకి మోహనరావు, తమిరి రాజు, బొమ్మాళి గన్నయ్య, కవిటి ఎర్రన్న, కింతల శేషగిరి, ఎంపీటీసీ అంబోడి విష్ణు, వైకాపా నాయకులు కణితి గిరి, కురమాన ఉత్తం కుమార్, రాజు, తాతబాబు, మురపాక జంగాలు, బాబ్జి, త్రివేణి, నాగభూషణ్, ధనుంజయ, చంద్రం తదితరులు పాల్గొన్నారు.



## విశాఖలో ప్రధాని మోదీ నేతృత్వంలో యోగా డే



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఉత్తరాంధ్రలో కీలకమైన విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ఐదు లక్షల మందితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని విశ్రాంత తహశీల్దార్, టీడీపీ నేత పేడాడ జనార్ధనరావు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్రమోదీ 2014లో ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించి ఆమోదింపజేసిన అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని 2015 నుంచి ప్రపంచవ్యాప్తంగా జూన్ 21వ తేదీన నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆనాడు 117 దేశాలు ఆమోదించి అమలు చేస్తున్నాయని నేటికి పదేళ్లు పూర్తయ్యాయన్నారు. ఈనెల 21న ఉదయం 6.30 నుంచి 7.45 వరకు విశాఖ బీచ్‌లో యోగాడే నిర్వహిస్తారని, ఇప్పటికే సిఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని యోగా ఫర్ ఒన్ ఎర్త్ ఒన్ హెల్త్ అనే నినాదంతో చేపట్టాలని పిలుపునివ్వగా దేశవ్యాప్తంగా ఇప్పటికే నెలరోజులుగా ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ఉత్తరాంధ్రలో కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అందరూ యోగా దినోత్సవ విజయవంతానికి నిమగ్నమయ్యారని పేడాడ తెలిపారు. ఆమదాలవలస ఎమ్మెల్యే, పియూసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ ఇప్పటికే ఈ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి అవిరళకృషి చేస్తున్నారని, ఆయనకు మద్దతుగా నిలవాలని పేడాడ జనార్ధనరావు విజ్ఞప్తి చేశారు. గతంలో ఇంటింటా మరుగుదొడ్డి స్వచ్ఛభారత్‌తో ప్రజల ఆరోగ్యం మెరుగుపడిందని, ఇప్పుడు యోగాతో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జరుగుతున్న కృషికి అందరి చేయూత అవసరమని జనార్ధనరావు అన్నారు. ఇకపై యోగా నిత్యకృత్యం కావాలన్నారు. ఇది మన దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత ఇనుమడింపజేసే చేసే గొప్ప కార్యక్రమమన్నారు. కనుక ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో సహా ఈ మహత్ కార్యక్రమంలో భాగస్వాములు కావడం అనేది భారతీయ పౌరులుగా తమ బాధ్యతగా భావించాలన్నారు. 21న తెల్లారి మూడు గంటలకే ప్రతి ఒక్కరు నిద్రలేచి నాలుగు గంటలకల్లా కాలకృత్యాలు పూర్తి చేసుకుని ఆయా సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసే బస్సులు ఎక్కి తమకు కేటాయించిన ప్రదేశానికి చేరుకుని యోగా దినోత్సవంలో పాల్గొనాలన్నారు. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఖరీదైన యోగా మేట్, విలువైన యోగా టీషర్ట్ తోపాటు మీకు స్నాక్స్, అల్పాహారం, తాగునీరు తదితర సకల ఏర్పాట్లును ప్రభుత్వమే చేస్తుందన్నారు. ఇది ఒక దేశభక్తి కార్యక్రమమని, ప్రతి ఒక్కరు ఇందులో పాల్గొని మనదేశం సృష్టించబోయే అద్భుత రికార్డులో తామంతా ప్రత్యక్ష భాగస్వాములు అవ్వాలని కోరారు. ఈ సమావేశంలో యోగ సైంటిస్ట్ డాక్టర్ బగాది పాపారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు, న్యాయవాది ఎస్.మురళి, ఎస్ వెంకట్రావు, సురేష్‌లున్నారు.

## బాడీ బిల్డింగ్ పోటీల్లో రాజాంకు పథకాలు



(సత్యంన్యూస్, పొందూరు)

పొందూరులో సోమవారం నాడు జరిగిన జిల్లాస్థాయి పురుషుల బెంచ్ ప్రెస్ బాడీబిల్డింగ్‌లో రాజాం క్రీడాకారులు పథకాలు సాధించి సత్తా చాటారు. డేవిడ్ 74 కేజీల విభాగంలో 1వ స్థానం, 66 కేజీల విభాగంలో రౌతు మని 3వ స్థానం సాధించారు. క్రీడాకారులకు రామాంజనేయ పవర్‌జిమ్ కోచ్ చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. బాడీబిల్డింగ్ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయ పడుతుందని కోచ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌లను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ సతీమణి రజనీ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి, హైస్కూల్ అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, రణస్థలం




నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 503వ రోజున 12వ వార్డు మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు 35మందికి అన్నసమర్పణ, మజ్జిగ బాటిల్, మామిడి పళ్ళు పంపిణి చేశారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

# డియర్ శేఖర్ కమ్ములా..

# నువ్వు నీలానే ఉండు!



ఒక్క సినిమా హిట్ అయితే చాలు..నేను తురుము, నేను తోపు అని విర్రవీగే దర్శకులు ఉన్న ఈ రోజుల్లో 25 సంవత్సరాలుగా, ఏ నిర్మాతకూ నష్టాలు రాకుండా కేవలం తను తీసింది 10 సినిమాలే అంటే కొంచెం ఆశ్చర్యమే.. సక్సెస్ వెంటపడే టాలీవుడ్ జనాలు శేఖర్ ను పట్టించుకోలేదు అనే కంటే, కేవలం సక్సెస్‌ని చూసి డైరెక్టర్ వాల్యూ చూసే టాలీవుడ్ ధోరణినే శేఖర్ పట్టించుకోలేదు. ఎందుకంటే, తను స్వతహాగా మృదుస్వభావి, ఇగోలు, భేషజాలు, స్పెషల్ క్యాంపులు, సోషల్ మీడియా టీంలూ, పెద్ద పెద్ద హై ఎండ్ ప్రీమియమ్ కార్లు, లక్సరీ ఆఫీసులు ఏవీ ఉండవు తనకి..

ముచ్చట సౌజన్యంతో...

తనకి తెలిసింది కేవలం తన ఐడియాలజీ, తన ఆలోచనలకి తగ్గ సినిమాలు తీయడం మాత్రమే.., అలాగే ఏదయినా సినిమాలో తప్పు జరిగితే నిర్మొహమాటంగా ఒప్పుకొని క్షమించమని కోరటం కూడా తనకే చెల్లింది. అందుకే రాజమౌళి అంటాడు నిన్న కుబేర ఫంక్షన్‌లో..

పైకి అలా కనిపిస్తాడు గానీ శేఖర్ తన ఆలోచనలకు తగినట్టుగానే సినిమా తీయడంలో స్టబ్బరన్ అని.. ఒక్క ఇంచు కూడా పక్కకు జరగడు అని..ధనుష్, నాగార్జున కూడా ఈ సినిమాకు హీరోలం మేం కాము, శేఖర్ మాత్రమే అని నిజాయితీగా సర్టిఫికెట్ ఇచ్చారు.. నిజం కాబట్టి.. లోపాలు, వైఫల్యాల్ని కూడా నిజాయితీగా అంగకరిస్తాడు, ఉదాహరణకు, హ్యాపీ డేస్ సినిమాలో లెక్చరర్ పాత్ర కానీ, అనామిక సినిమా రీమేక్ కానీ!!

ఆయనలాగే అయన సినిమాలు చాలా సున్నితం. అయనలాగే అయన సినిమాలు నెమ్మదిగా ఉంటాయి.. ఎక్కడా పెద్దగా సినిమా ఫంక్షన్లకి పోడు కానీ చాలా కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్ గా వెళ్తూ వుంటాడు.. మీరు ఏ ఫంక్షన్లో ఎప్పుడైనా ఎక్కడైనా శేఖర్ ని ఈజీగా గుర్తుపట్టొచ్చు.. ఎందుకంటే, మీ ఇంటిలో కానీ పక్కింటిలో కానీ మీకు తెలిసిన వాళ్ళు ఎలా ఉంటారో తాను అలానే ఉంటాడు.

వాళ్ళ మనుషులే, వాళ్ళ ఎమోషన్స్‌ని గుర్తించి, వాళ్ళకి వాళ్ళ కుటుంబ సభ్యుల మధ్య ఐడెంటిటీ ఇవ్వడమంటే చాలా గ్రేట్.. నార్మల్‌గా ఈవెంట్లలో, సినిమా ఈవెంట్లలో సెలబ్రిటీ గ్యాలరీ అని ఒకటి క్రియేట్ చేస్తుంటారు. ఓన్లీ సినిమా ఇండస్ట్రీ జనాలను మాత్రమే కూర్చోపెడుతారు, ఆ గ్యాలరీ అంతా తారల తళుకు బెళుకులే కనిపిస్తాయి, కానీ నిన్న ఆ గ్యాలరీ అంతా మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలే కనిపించాయి, దానికి కారణం శేఖర్ కమ్ముల..వాళ్ళందరిని సెలబ్రిటీ గ్యాలరీలో కూర్చోపెట్టిన ఘనత తనది!!

చిన్నగా పెరిగిన గడ్డం, ఒక ఫార్మల్ ప్యాంటూ, షర్ట్, చెప్పులు వేసుకొని మనందరిలానే మామూలుగా ఉంటాడు.. అతనికి సినిమా అంటే ఫ్యామిలీ.. అందుకే తన ప్రతి సినిమాని తన కుటుంబంలోని ఎవరితో ఒకరితో పోలుస్తూంటాడు.. నిన్నటి కుబేర సిని మా ఈవెంట్లో అందరికంటే ముందే వచ్చి, తన అసిస్టెంట్ల ఫ్యామిలీస్‌ని రమ్మని చెప్పి, అందరికీ దగ్గరుండి మరీ సీటింగ్ ఆరెంజ్ చేసేదాకా తను కూర్చోలేదు.. ఇవ్వాళారేపు ఏ దర్శకుడండీ, తన అసిస్టెంట్లను, వాళ్ళ ఫ్యామిలీలని పట్టించుకునేది..?

ఒక దర్శకుడు ఎంత గొప్పవాడో తెలియాలంటే తన అసిస్టెంట్ డైరెక్టర్లు ఎంత మంది సక్సెస్ అయ్యారో చూస్తే చాలు.. సాధారణంగా సినిమా ఈవెంట్ల స్పీచ్ లలో చిన్నచిన్న హీరోలు లేదా టెక్నీషియన్స్ నుంచి మొదలుపెట్టి వాళ్ల వాళ్ల స్టారడమ్ ని బట్టి ఒక ఆర్డర్లో థాంక్స్ చెప్పడమో జరుగుతుంది!!కానీ నిన్నటి ఈవెంట్లో కేవలం తన ఎమోషన్స్ ఆధారంగా ఒక నోట్ బుక్లో రాసుకొని వచ్చి అందరికీ నువ్వు థాంక్స్ చెప్పిన విధానానికి హేట్సాఫ్ శేఖర్.. అందుకే నీ సినిమాలూ, నువ్వూ ఎప్పటికీ ఇంతే స్వచ్ఛంగా, నిజాయితీగా ఉండాలని కోరుకుంటూ..

– మీ..అభిమాని



## బెడ్‌పై జాన్వీ మతి చెడే భంగిమలు

నేటి జెన్ జెడ్ కిడ్స్‌లో జాన్వీకపూర్ స్టైల్ వేరు. ఈ భామ తన కోస్టార్స్ కంటే అన్నిటిలో అడ్వాన్స్‌డ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు స్టన్నింగ్ ఫ్యాషన్‌సెన్స్, మేకోవర్‌తో కట్టి పడేస్తుంది. స్టైల్ ఐకాన్ అన్న పదానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుంది. ఇప్పుడు ఈ జెన్ జెడ్ బ్యూటీ మరోసారి తనదైన స్టైల్ ఎలివేషన్ తో మతులు చెడగొడుతోంది. జాన్వీ టాప్‌లెస్ దుస్తుల్లో కనిపించి టాప్ లేపేసింది. ఈ కపూర్ బ్యూటీ తనలోని ఇన్నర్ సొగసును ఆవిష్కరించే లోదుస్తులను ధరించింది. అయితే ఈ లోదుస్తులను కవరప్ చేస్తూ, బ్లాక్ కలర్ కోట్‌ని కూడా జాన్వీ కపూర్ ధరించింది. ఒక ఫోటోలో జాన్వీ ఊలు జాకెట్ ని కూడా ధరించి కనిపించింది. ముఖ్యంగా బెడ్ పై రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చిన జాన్వీ.. రకరకాల డిజైనర్ లుక్స్ లో కనిపించి హృదయాలను కొల్లగొట్టింది. ఈ ఫోజులు చూడగానే యూత్ జాన్వీ భంగిమలకు మైండ్ బ్లాంక్ అయ్యిందని కామెంట్ చేస్తున్నారు. ఓ నెటిజన్ బెడ్ పై జాన్వీ భంగిమలు చూడగానే మతి చెడింది! అంటూ ట్వీట్ చేసాడు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ యువతరం వాట్సాపులు, సోషల్ మీడియాల్లో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్‌కి వస్తే.. జాన్వీకపూర్ ఇటీవలే ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటించింది. వెంటనే మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ సరసన “పెద్ది”లో అవకాశం అందుకుంది. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతున్న సంగతి తెలిసిందే. ఓవైపు చరణ్ తో షూటింగ్ లో పాల్గొంటూనే, మరోవైపు వరుసగా మ్యాగజైన్ కవర్ ఫోటోషూట్లను జాన్వీ షేర్ చేస్తోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

## కూటమి ప్రభుత్వం సంక్షేమాల పక్షం

(సత్యంన్యూస్, పాతపట్నం)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పేదల పక్షాన నిలుస్తూ సంక్షేమ పథకాల అమలులో కీలక భూమిక పోషిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం ద్వారా ఒకేరోజు రూ.10వేల కోట్లకు పైగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఎకౌంట్లో జమ చేశామన్నారు. తల్లికి వందనం పథకం అమలు విజయవంతం కావడంతో వైకాపా నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది చదువుకుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం అమలు చేసి తల్లి అకౌంట్లో ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున మంజూరు చేశారన్నారు. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా శాఖలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. విద్యా శాఖపై రాజకీయ ప్రభావం కనిపించకుండా నోట్‌బుక్స్ పుస్తకా లపై రాజకీయ నాయకుల బొమ్మలకు చరమగీతం పాడారన్నారు. మధ్యాహ్నం భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టి సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించిన ఘనత లోకేష్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు ఆరోగ్యవంతంగా ఉండడమే కూటమి లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేనివిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఏడాదిలో రికార్డు స్థాయిలో రూ.400 కోట్లు బాధితులకు అందించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాలు అమలుపై ప్రజల్లో వస్తున్న ఆదరణ ఓర్వలేక వైకాపా సంఘ విద్రోహక చర్యలకు పాల్పడుతుందన్నారు. గంజాయి బ్యాచ్‌ని పరామర్శించడానికి వచ్చి మహిళలు పోలీసులుపై రాళ్లు చెప్పులతో విచక్షణారహితంగా దాడి చేయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏడాదికి 30 వేల కోట్ల రూపాయలు ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు ఇస్తుందని, ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేస్తుందని, మామిడి టొబాకో సహా ఇతర పంటలకు ఉన్న ఇబ్బందులు తక్షణమే తొలగిస్తూ రైతులు ఉపశమనం కలిగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో అంతులేని అవినీతిలో వేల కోట్ల రూపాయలు దోచుకున్న దోపిడీదారులపై కూటమి ప్రభుత్వ విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.




## అరసవెల్లిలో ఘనంగా యోగ కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న భారీ స్థాయి యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లావాసులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. శ్రీకాకుళం నుంచి 20వేల మంది కార్యక్రమానికి బయలుదేరనున్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులు ప్రజలతో కలిసి పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లాలో చారిత్రక ప్రదేశాలను నిర్వహించే యోగాలో భాగంగా అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రముఖ యోగా గురువు పాండ్రంకి మురళీకృష్ణ పర్యవేక్షించారు. వేదికపై యోగా నిపుణులు మురళి, స్వాతి, కల్పన, గాయత్రి, కిరణ్‌లు మార్గదర్శకత్వం వహించారు. ఇక అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న శ్రీకాకుళంలో 80 ఫీట్ల రోడ్డులో లేదా ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో 3వేల మంది పాల్గొనేలా యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో ఐసిడీఎస్ పీడీ శాంతిశ్రీ, టూరిజం అధికారి నారాయణరావు, డబ్ల్యూఎంఏ పీడీ సుధాకరరావు, ఆయుష్ అధికారి డా. పి.జగదీష్, డా. ఉత్తమ్ రాజ్ రాణా, జె. శేఖరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



## వికసిత భారత్ సంకల్ప సభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే



(సత్యంన్యూస్, రణస్థలం)

బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం 11సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వికసిత భారత్ సంకల్ప సభను మండల బిజెపి అధ్యక్షులు పైల విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభకు ముఖ్య అతిధిగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్, ప్రత్యేక అతిధిగా జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, బిజెపి సీనియర్ నాయకులు పైడి వేణుగోపాలం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం 11 ఏళ్లలో భారత దేశ దశ, దిశా మార్చిందన్నారు. భారత వైభవాన్ని విశ్వ వేదికపై నిలబెట్టిందని..సేవ, సుపరిపాలన పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ 11 ఏళ్ల ప్రయాణం విజయవంతమైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ, కూటమి పార్టీలతో కలిసి తిరుగులేని శక్తిగా నిలవాలని, దానికి సంబంధించిన కార్యచరణ సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో వజ్జపర్తి రఘురామ్, కుమరాపు రవి కుమార్, టంకాల మౌలిశ్వరరావు, బురాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు మాస్టర్, మీసాల రామకృష్ణ, ముద్దాడ గౌరి తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలిలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ

(సత్యంన్యూస్, టెక్కలి)


బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న చంద్రబాబునాయుడు పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని టెక్కలి వైకాపా కార్యాలయంలో మండల వైకాపా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సత్తారు సత్యం తదితరులు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు చేస్తున్న అరాచకాలు, ఏడాది పాలనలో చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టెక్కలి టౌన్ అధ్యక్షులు తమ్మన్న గారి కిరణ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జీవన్, నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆట్ల రాహుల్ కుమార్, ఎంపీటీసీ కుర్మారావు, ఎంపీటీసీ ప్రతినిధులు బెండి ఉదయ్, అనంతయ్య, చందర్ రావు, సర్పంచులు వాన తవిటయ్య, తుంటు మల్లన్న, రాజేశ్ ఉప సర్పంచులు గండి అప్పలరెడ్డి, ఉమాపతి, కామన్న, వార్డు సభ్యులు పిత రమణబాబు, దాడి ధర్మారావు, కుశుడు, నాయకులు తమ్మయ్య, జగదీష్, మదీన్ శ్యామలరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## మిస్టర్ ఆంధ్ర పోటీలకు సిక్కోలు బాడీ బిల్డర్లు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 22వ తేదీన నెల్లూరు జిల్లా కావలిలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ జరుగునున్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి పదిమంది బాడీ బిల్డర్లు ఎంపికయ్యారు సోనీ ఫిట్నెస్ ఆధ్వర్యంలో నిన్న పొందూరులో బెంచ్ ప్రెస్ పోటీల్లో జిల్లాస్థాయిలో జరిగాయి. ఆ కార్యక్రమంలో కొంతమంది బాడీ బిల్డర్లకి ఎంపిక చేశారు స్టార్ బాడీ బిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి. విజయకుమార్ ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కే. గౌరీ శంకర్ ఆమదాలవలస, వి రమేష్ విజయనగరం వారు పరిరక్షణలో ఎంపిక చేశారు. 60 కేజీల విభాగంలో అవినాష్, 75కేజీల విభాగంలో కే.గౌరీ శంకర్, 55కేజీల విభాగంలో ప్రేమ్‌కుమార్, 65కేజీల విభాగంలో శివలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సోనీ ఫిట్నెస్ రాము పవర్ లిఫ్టర్ రామాంజనేయ జిమ్ అధినేత శేఖర్ సీనియర్ బాడీబిల్డర్లు వెయిట్ లెటర్స్ పవర్ లిఫ్టర్లు సంతు రజాక్ మదీనా పొందూరు పెద్దలు పాల్గొన్నారు.



## "యోగా" ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న 'యోగాంధ్ర' కార్యక్రమంపై గొండు శంకర్ స్థానిక విశాఖకోలనీ పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా అధికారులు, టీడీపీ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి అధికార బృందాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని, యోగాను భావితరాలకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా డేలో పాల్గొంటారని, విశాఖలో పర్యటించిన సీఎం చంద్రబాబు యోగాంధ్ర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారన్నారు. ఈ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొంటున్నారని, మన నియోజకవర్గాల నుండి జనసమీకరణ ఏర్పాట్లు పై స్పష్టత కోసం కార్యక్రమం జరిగిందన్నారు. అనంతరం యోగాంధ్ర వేడుకలలో భాగముగా విచ్చేసిన కృష్ణ జిల్లా, పామూరు నియోజకవర్గ నాయకులు వర్ల. కుమార్ రాజా, శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రజలందరి అభిమానం సొంతం చేసుకొని, అందరివాడుగా, అందరి మన్ననలు పొందు




తున్న శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు.శంకర్‌కు ప్రత్యేక అభినందనలన్నారు. దేశ ప్రధాని పిలుపుమేరకు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా. చంద్రబాబునాయుడు యోగాంధ్ర విజయోత్సవాలను, విజయవంతం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా మనమంతా కలసి, శ్రీకాకుళం నియోజకవర్గం నుండి అధిక జన సమీకరణతో పాల్గొని యోగాంధ్రాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండలస్థాయి, గ్రామస్థాయి టీడీపీ అధికార బృందం, కార్యకర్తలు, అభిమానులు, డివిజన్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


వ్యాపార ధోరణితో వ్యవహరిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల బతుకులతో ఆటలాడుకుంటున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు డీఆర్వో వెంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హరీష్ జయరాం మాట్లాడుతూ నగరంలోని 80 ఫీట్ రోడ్లో గల నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహిస్తున్న తరగతులను ఎస్ఎఫ్ఐ తరుపున అడ్డుకున్నామన్నారు. ప్రిన్సిపాల్‌ను నిలదీసి యాజమాన్య తీరును ఎండగట్టామన్నారు. సెలవు దినాల్లో తెరిచిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెలవుల్లో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే విద్యారంగాన్ని కాపాడాలని విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆర్ఐఓ దుర్గాప్రసాద్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా సరే పట్టించుకోలేదన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ కార్పొరేట్ విద్యా సంస్థలకు అమ్ముడుపోయారా అన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ నాయకులు కార్తీక్, భాను, భరత్ శివ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ కార్మికులందరికీ (ఇంజనీరింగ్,పారిశుధ్య) తల్లికి వందనంతోపాటు ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) నాయకులు మంగళవారం శ్రీకాకుళం నగర కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగి అనే పదాన్ని తొలగించి మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనంతోపాటు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గత 17రోజుల సమ్మె సందర్భంగా ప్రతిపక్షనేతగా చంద్రబాబు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు, ప్రజలు ఆశించారన్నారు. అందుకు భిన్నంగా ప్రభుత్వ విధానం అవలంభిస్తోందన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ (ఇంజనీరింగ్, పారిశుధ్య) ఎటువంటి షరతులు లేకుండా తల్లికి వందనంతోపాటు ఇతర సంక్షేమపథకాలు వర్తింపజేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ &ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షులు ఎ.గణేష్, కమిటీ సభ్యులు ఎ.గురుస్వామి, ఆర్జి.శేఖర్, ఎ.జనా తదితరులు పాల్గొన్నారు.



## తోటపల్లి బ్యారేజీ షట్టర్స్ ఏర్పాటు చేయండి



(సత్యంన్యూస్, పార్వతీపురం)

తోటపల్లి బ్యారేజి వద్ద పాత కుడి,ఎడమ కాలువల్లో పని చేయని షట్టర్స్‌ను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో డీఆర్వోను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీటికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. కాలువలలో ఉన్న పూడికలను, తుప్పలో డొంకలను తొలగించడం హర్షణీయమన్నారు. గత నెల 26, 29 తేదీల్లో పాలకొండ సబ్ కలెక్టర్ సమక్షంలో జల వనరుల శాఖ అధికారులతో తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల సాధన సమితి, రైతు సంఘం ప్రతినిధి వర్గంతో జరిగిన సమావేశంలో తమ ప్రధాన డిమాండ్ అయిన తోటపల్లి బ్యారేజీ వద్ద పాత కుడి,ఎడమ కాలువల్లో పని చేయని షట్టర్స్‌ను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. దీనికి స్పందించిన జల వనరుల శాఖ అధికారులు పదిరోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కొత్త షట్టర్స్‌ను ఏర్పాటుచేసి ఖరీఫ్ సాగునీటికి ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ ఆ ప్రక్రియ జరగలేదన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడితే టెండర్ వేయటానికి ఎవరు ముందుకు రావడంలేదని, టెండర్ వేసిన వారు కూడా పని చేసేందుకు ముందుకు రావడం లేదని చెబుతున్నారన్నారు. దీనిని బట్టి చూస్తే ఖరీఫ్ సీజనుకు షటర్స్‌ను బాగు చేస్తారా లేదా అనే ప్రధాన అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయన్నారు. తక్షణమే పాడైపోయిన షట్టర్స్ స్థానంలో కొత్త షట్టర్సును ఏర్పాటు చేసి ఆయకట్టు పొలాలకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకునేలా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించాలని కోరారు.

## జీడి పరిశ్రమలను తెరిపించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జీడి పరిశ్రమలు యాజమాన్యాలు అక్రమంగా బంద్ చేసిన పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరిపించాలని లేకపోతే జూన్ 21న పలాసలో కార్మికులతో మహాధర్నా చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు యం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య హెచ్చరించారు. మంగళవారం శ్రీకాకుళం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పలాస పారిశ్రామిక ప్రాంతంలో జీడి పరిశ్రమల యాజమాన్యాలన్ని పరిశ్రమలు ఆకస్మికంగా బంద్ ప్రకటించడం చట్టవ్యతిరేకమైన చర్యన్నారు. పరిశ్రమలు బంద్ చేసి 2వారాలు పూర్తయినా నేటికీ తెరవకపోవడంతో సుమారు 20వేల మంది కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసివేసిన పరిశ్రమలు వెంటనే తెరిపించాలని, బంద్ కాలానికి కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ కట్టాలని వారు యాజమాన్యాలను డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా పరిశ్రమలు బంద్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. జీడి పప్పుకు ధర లేదనే పేరుతో బందుకు పిలుపు ఇచ్చినట్లు పరిశ్రమల యాజమాన్యాలు చెప్పడం సరైనది కాదన్నారు. యాజమాన్యాలకు లాభాలు వచ్చినపుడు కార్మికులకు అదనంగా ఇన్సెంటివ్ ఏమీ ఇవ్వడం లేదన్నారు. నష్టాల పేరుతో పరిశ్రమలు మూసివేయడం వల్ల కార్మికులకు ఉపాది లేకుండా పోయిందన్నారు. జీడి రైతుల నుంచి తక్కువ రేటుకు పిక్కలు కొని అటు రైతులను, ఇటు కార్మికులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే జీడి పరిశ్రమలు తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని, మూసివేసిన కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించే విధంగా కార్మికశాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
























# ఆధారాలు లేని ఆరోపణలు సరికాదు



* జగన్ మాయమాటలకు ప్రజలు లొంగిపోలేదు
* శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాయ మాటలకు రాష్ట్ర ప్రజలు లొంగిపోలేదని, తమ ఓట్లతో సరైన సమాధానం చెప్పినా, ఆయన తీరు మారకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఎ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం అమలుచేస్తున్న భావితర నేత నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.13 వేలు ఇస్తుంటే, వైకాపా నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేయటం సరికాదని, ఆధారాలు లేని ఆరోపణలు చేయడమే వైకాపా నేతల పని అని అన్నారు. వైకాపా పాలనలో రూ.13 వేలు ఇచ్చారంటే, రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా లేక తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వర్తించాలని లోకేష్ కృషి చేస్తుంటే, వైకాపా అసత్య ప్రచారాలను చెయ్యటం విడ్డూరంగా ఉందన్నారు.


కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్యతరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం గుర్తుకురావటం లేదేమోనన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, పాఠశాలలు తెరిచేలోగా పథకం అమలు చేశారని, 1వ తరగతిలోనూ, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లోనూ చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం అమలుచేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లి లేని పిల్లలకు వారి తండ్రికి కానీ, లేదంటే సంరక్షుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని, అనాథలైన పిల్లలకు జిల్లా కలెక్టర్ నిర్ధారించిన తర్వాత పథకం వర్తింపచేస్తామన్నారు. కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తానని, ఎంతవరకు చదవుకుంటే అంతవరకు చదివిస్తానని మాయమాటలు చెప్పి బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు చందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసింది ఎవరని ప్రశ్నించారు. మోసపూరిత జగన్ తీరు మార్చుకోకుంటే, రానున్న ఎన్నికల్లో ఒక్క సీటు కూడా పొందలేరని, ఇప్పటికే బెంగళూర్‌కు మకాం మార్చారని, ఇక అక్కడే పరిమితమవ్వాల్సి ఉంటుందన్నారు.

అలాగే ఈ నెల 21న విశాఖపట్నంలో జరగనున్న భారీ స్థాయి యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లావాసులు, నియోజకవర్గ ప్రజలు, యోగా గురువులు, సాధకులు, పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చెయ్యాలని కోరారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 5వేల మంది కార్యక్రమానికి బయలుదేరాలని ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు.













Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.